గుండెపోటుతో జీసీసీ హమాలీ మృతి

ప్రజాశక్తి -పాడేరు: చింతపల్లి మండల కేంద్రంలో జిసిసిలో పనిచేస్తున్న హమాలి సూరిబాబు(46) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఎప్పటిలాగానే ఉదయాన్నే పనిలోకి వచ్చిన హమాలి సూరిబాబు, బియ్యం లోడ్ చేసుకొని బలపం పంచాయితీ రాళ్ళగడ్డ డిపోలో దింపి మధ్యాహ్నం చింతపల్లి చేరుకున్నారు. అప్పటికే గుండెలో చిన్నపాటి నొప్పి వస్తుందని తోటి కార్మికులతో చెప్పాడు. చింతపల్లి చేరుకొని బండి దిగగానే నొప్పి ఎక్కువై, ఆ విషయాన్ని తోటి కార్మికులకు చెప్పి అలాగే కుప్పకూలిపోయాడు తోటి కార్మికులు హుటాహుటిన చింతపల్లి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించినప్పటికీ, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని సొంతూరు కొత్తకోట దరి కస్పంపేటకాగా, భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఏడాదిగా జీసిసిలో దినసరి కూలిగా పనిచేస్తున్నాడు.కుటుంబపెద్దదిక్కు, జీవనాధారం కోల్పోయిన సూరిబాబు కుటుంబానికి రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పట్టని మోడీ

★ కేంద్ర బిజెపి ప్రభుత్వానికి భజన చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పండి

★ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

★ పోరుకేక పాదయాత్రకు ఆదివాసీల బ్రహ్మరథం

భారీ జనసమూహంతో జరుగుతున్న పాదయాత్ర, అగ్రభాగాన వి.శ్రీనివాసరావు, వెంకట్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం విలేకరి

పోలవరం నిర్వాసితుల సమస్యలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిన బిజెపికి భజన చేస్తున్న రాష్ట్రంలోని బాధిన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన పోరుకేక పాదయాత్ర మూడో రోజు గురువారం సమరోత్సాహంతో సాగింది. మధ్యాహ్నం భోజనం అనంతరం పాదయాత్ర భగవాన్ పురం మెయిన్ రోడ్డు మీదుగా రాత్రికి కూటూరుకు చేరుకుంది. ముల్లూరు గ్రామ ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భగవాన్‌పురం, ముల్లూరు, కూటూరు గ్రామాలలో జరిగిన సభల్లో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇక్కడ మునిగి పోదామా, తిరుగుబాటు చేద్దామా? అని ప్రజలను ప్రశ్నించారు. ప్రభుత్వాలు అడవి నుండి, భూమి నుంచి వేరు చేద్దామని చూస్తున్నాయని, ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర జరుగుతున్న 15 రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే జులై 4న బృహత్తర కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. పోలవరం నిర్వాసితులు ఒంటరి వాళ్ళు కాదని, రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు కూడగడతామని చెప్పారు.

45 కాంటూరులో ఉన్న గ్రామం పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాకా ముందే ముంపునకు గురైందని, కాంటూరు లెక్కలు డొల్ల తనానికి ఇది ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. గతేడాది గోదావరి వరద ముంపు సమయంలో ప్రభుత్వం బాధితులకు రూ.2వేలు నగదు, బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే గ్రామాల్లోకి వస్తే ప్రజలు తరిమెందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్ జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ 10 లక్షలు, గతంలో ఎకరాకు రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు రూ.5 లక్షలు, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని అన్ని పంచాయితీల్లో తీర్మానం చేసి ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

కటిక నేలపై మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పాదయాత్రకు బ్రహ్మ రథం

సీపీఎం పోరుకేక పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. భగవాన్‌పురం గ్రామంలో స్థానిక మహిళలు కుంకుమ దిద్ది హారతి పట్టారు. గ్రామానికి చెందిన పులి వెంకమ్మ మాట్లాడుతూ తమ గ్రామం ముంపునకు గురైనప్పుడు ఎవరు ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు సమయంలో తమ కుటుంబం పడిన ఇబ్బందులు వివరించారు. మళ్లీ వర్షాకాలం ప్రారంభం కావడంతో వరద భయం వెంటాడుతుందని తెలిపారు. తమ గ్రామంలో ఉపాధి హామీ పనులు సైతం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పాదయాత్ర ముల్లూరు గ్రామానికి చేరుకుంది. అక్కడి ప్రజలు పూల మాలలతో స్వాగతం పలికారు. రాత్రి తొమ్మిదైనా పోరుకేక పాదయాత్ర కోసం వేచి చూడడం వారిలో సీపీఎంపై ఉన్న నమ్మకానికి దర్పణం పట్టింది. కేవలం 150 గడపలు ఉన్న గ్రామంలో యువత పోరుకేక నిర్వహణకు ఆర్థిక సహాయం అందరుజేశారు. గ్రామ యువకుడు పొద్దేటి అశోక్ మాట్లాడుతూ వరదల సమయంలో తమకు సీపీఎం మాత్రమే అండగా నిలిచిందన్నారు. జులై 4వ తేదీన విజయవాడలో జరిగే సభకు అందరం వెళ్తామని చెప్పారు. అనంతరం పాదయాత్ర కూటూరు గ్రామానికి చేరింది. అక్కడ నాయకులు బస చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు మేకల నాగేశ్వరరావు, తెల్లం రామకృష్ణ, మడెం నాగమణి, కుంజా రాధ, అజయ్, విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, పెదర్కూర్ సర్పంచ్ మడకం నాగమణి, పెదర్కూర్ ఎంపీటీసీ అమ్మాజీ, కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం తెలియజేస్తున్న మాజీ ఎంపీ సోడే రామయ్య

జెండా పట్టి పాదయాత్ర అగ్రభాగాన నడుస్తున్న బాలుడు

వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న పోలవరం నిర్వాసితులు

సత్వర పౌరసేవలు జగనన్న సురక్ష లక్ష్యం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : అర్హత కలిగిన లబ్దిదారులకు సత్వర పౌర సేవలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దారులు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపిడిఒలు, తహశీల్దారులు ముందుగా సిద్ధం చేసుకున్న షెడ్యూలు ప్రకారం సచివాలయాల్లో పర్యటించి, అక్కడ అందుతున్న సేవలపై వాలంటీర్లకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రజలు సమస్యలను తెలుసుకోవాలని, అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీకి సచివాలయంలో ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను సంబంధిత విఆర్ఒ, ఆర్ఐ పరిశీలించి తహశీల్దార్ లాగిన్‌కు పంపించాలని, తహశీల్దారులు పరిశీలించి, అర్హులైన వాటన్నింటినీ ఆమోదించి, లబ్దిదారులకు సకాలంలో ధ్రువీకరణలు జారీ చేయాలని స్పష్టం చేసారు.
నెల రోజులపాటు జరిగే జగనన్న సురక్షకార్యక్రమంలో ధ్రువీకరణల జారీపైనే ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జూలై ఒకటో తేదీ నుండి సచివాలయ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం చేయకుండా కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబసభ్యుల ధ్రువీకరణలు, రైస్‌కార్డుల విభజన వంటి ప్రక్రియలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, డిఆర్ఒ పి.అంబేద్కర్, జి. మాడుగుల మండల ప్రత్యేకాధికారి, డిపిఆర్ఒ పి. గోవిందరాజులు, జికేవీధి మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ ఇఇ బి.బాబు హుకుంపేట ప్రత్యేకాధికారి, డిఇపి కొండలరావు, ముంచంగిపుట్టు ప్రత్యేకాధికారి,డిఆర్‌డిఎ పిడి మురళి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన

ఇంద్రకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : అరకులోయ ఎపి రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదివి, సిఇసి గ్రూపులో 919 మార్కులతో రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచిన అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ పింపోలుగూడ గ్రామానికి చెందిన సమ్మిరెడ్డి ఇంద్రపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సమ్మిరెడ్డి జగబందు, సీతమ్మలకు జన్మించిన సమ్మిరెడ్డి ఇంద్ర ఇంటర్మీడియేట్ ఫలితాల్లో స్టేట్ టాపర్‌గా నిలవడం ద్వారా ఆ కుటుంబంతోపాటు అరకులోయ ఎపిఆర్ కాలేజీకి, అల్లూరి జిల్లాకు మంచి పేరు తెచ్చిందని పలువురు అభినందించారు. పింపోలుగుడ సందర్శనకు వెళ్లిన సిపిఎంకు చెందిన స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఇంటర్ టాపర్ ఇంద్రను కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు. సొంత నిధులు రూ.1500 ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా తమబిడ్డకు అరకులోయ ఎపిఆర్ కాలేజీకి చదువుకునేందుకు అవకాశం కల్పించేలా సీటు ఇప్పించిన జెడ్‌పిటిసి గంగరాజును ఇంద్ర తల్లిదండ్రులు జగబంధు, సీతమ్మలు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఇంటర్ సిఇసి గ్రూపులో స్టేట్ టాపర్‌గా నిలిచిన ఇంద్రకు జగనన్న ఆణిముత్యాలు కింద రాష్ట్రస్థాయి ప్రోత్సాహకంగా సిఎం జగన్ రూ.లక్షను అందించగా, జిల్లాస్థాయి ప్రోత్సాహకంగా రూ.50వేలను కలెక్టర్ సుమిత్‌కుమార్, నియోజవకర్గ స్థాయి ప్రోత్సాహకంగా రూ.15వేలనుఅందించారు. కాగా గిరిజన ఆణిముత్యం ఇంద్ర ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం తరపున అధికారులు అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వీధిదీపాల ఏర్పాటు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: కొన్ని రోజులుగా అంధకారంలో మగ్గుతున్న మండల కేంద్రమైన డుంబ్రిగుడలో గురువారం స్థానిక పంచాయతీ సెక్రెటరీ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలపై వీధి దీపాలను అమర్చారు. వీధిదీపాలు లేకపోవడంతో చీకటైతే బయటకు రాలేని పరిస్థితుల్లో గిరిజనులు నానా ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు వీధిదీపాల ఏర్పాటుతో వారంతా హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పరిహారమిచ్చి పనులు చేపట్టండి

రైల్వేలైన్ పరిశీలిస్తున్న మొస్య, తదితరులు

ప్రజాశక్తి-అనంతగిరి : కెకె.లైన్‌లో రెండో రైల్వేలైన్ విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని, లేకుంటే అడ్డుకుని తీరతామని సిపిఎంకు చెందిన టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య హెచ్చరించారు. గురువారం టోకూరు పంచాయతీ దొరగుడ, కొత్తవలస, బలియగుడ, కంబవలస గ్రామాల్లో నిర్వాసిత రైతులతో కలిసి నష్టపోతున్న భూములను పరిశీలించారు. ఆయా భూముల్లోకి కాఫీ, మిరియాల తోటలు,ఇతర పంటపొలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో రైల్వేలైన్ వల్ల నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపోతున్న భూములకు పట్టా ఉన్నా లేకున్నా గాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిర్వాసిత రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు గెమ్మెల దేవన్న, సబ్ కాంట్రాక్టర్ వెంకటేష్, రైతులు గెమ్మెల లక్ష్మణరావు, గెమ్మెల మల్లన్న, తామల చిన్నయ్య, గెమ్మెల కన్నయ్య, .పండన్న, నీలన్న, రమణ, బుజ్జిబాబు, పూజారి .అప్పలరాజు పాల్గొన్నారు

గిరిజనుల మృత్యుఘోష పట్టదా?

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రకాశక్తి-రాజవొమ్మంగి : అల్లూరి జిల్లాలో మారుమూల గ్రామాలకు సరైన రహదారి సదుపాయాలు లేక, వాహనాలు తిరగక అత్యవసర సమయాల్లో గిరిజనులకు వైద్య సేవలు అందకపోవడంతో ఇటీవల అనేకమంది మృతి చెందారని, అయిన ప్రభుత్వానికి గిరిజనుల మృతుఘోష పట్టడం లేదని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని కొయ్యూరు మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కుమ్ముర్ల గ్రామానికి చెందిన నిండు గర్భిణి పాంగి రోజా (20)కి మంగళవారం ఫిట్స్ రావడంతో రహదారి సౌకర్యం లేక ఆశా కార్యకర్త, కుటుంబీకులు డోలీపట్టి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న డౌనూరు పిహెచ్‌సికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో ఆకస్మికంగా మృతి చెందిందని తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు గొప్పలు చెబుతున్నా ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. విద్యా, వైద్యం, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు ఏజెన్సీలోని అనేక గ్రామాలకు ఇంకా లేని పరిస్థితి ఉందన్నారు. పిహెచ్‌సిల్లో పరికరాలు, మందులు, సిబ్బంది కొరత ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని విమర్శించారు. తరచూ మారుమూల గిరిజన గ్రామాలలో సకాలంలో వైద్యసహాయం అందక గిరిజనులు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో రహదారుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి ఉంటే ఇన్ని ప్రాణాలు పోయిండేవి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. సకాలంలో వైద్య సేవలు అందక మృతి చెందిన గర్భిణి రోజా కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రహదారులు, రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘాట్ రోడ్డులో ఆగిన లారీ

భారీగా నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో వాలీ సుగ్రీవ మలుపు సమీపంలో సాంకేతిక లోపం కారణంగా గురువారం భారీ లారీ రహదారికి అడ్డంగా ఆగిపోయింది. దీంతో ఈ మార్గంలో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డుపై పరిమితికి మించిన భారీ లారీలు ప్రయాణించడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఘాట్ రోడ్‌లో 35 టన్నుల లోడు సామర్థ్యం కలిగిన వాహనాలకు మాత్రమే రాకపోకలకు అనుమతి ఉంది. కాని సుమారు 60 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ లారీలు సైతం ఘాట్ రోడ్లో ప్రయాణించడంతో పలుమార్లు లారీలు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలు ఉన్నాయి. ఘాట్ రోడ్డు ప్రమాదకరమైన మలుపులతో ఇరుకుగా ఉండడంతో భారీ లారీలు మలుపులు తిరగకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఈ మార్గంలో భారీ లారీలను నిషేధించి, ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికుల రాకపోకలు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా నిలిచినపోయిన భారీ లారీ

విద్యుత్ ఛార్జీల పెంపుపై సిపిఎం నిరసన

సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు.. వినతిపత్రం అందజేత

డుంబ్రిగుడలో ధర్నా చేస్తునన సిపిఎం నేతలు

చింతపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ సర్దుబాటు పేరుతో ఛార్జీల భారం వేయవద్దని, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం అరకువేలి విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంఆ పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ.వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్లలో ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, సామాన్యులపై మోయలేని భారం వేసిందన్నారు. తాజాగా సర్దుబాటు ఛార్జీల పేరుతో వడ్డన, .కొత్తగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ద్వారా ఒక్కో వినియోగదారునిపై రూ.13వేలు వసూలుకు సిద్ధపడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఉచితవిద్యుత్ హామీనిచ్చి, ఇపుడు ఛార్జీల మోత మోయిస్తున్నారని, వెంటనే తగ్గించకుంటే తీవ్ర ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పొద్దు బాలదేవ్, జి బుజ్జిబాబు, కె మగ్గన్న,కె మొద్దు, జి.చిన్నబాబు, పి రామన్న, వి సింహాద్రి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లతో భవిష్యత్‌లో వినియోగదారులకు తీవ్ర ముప్పు ఉందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే దశలవారీ ఆందోళన తప్పదని హెచ్చరించారు సిపిఎం మండల ప్రధానకార్యదర్శి ఎస్‌బి పోతురాజు, మండల నాయకుడు పి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాడేరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోందని సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ మండిపడ్డారు. గురువారం చింతపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యుత్ విధానాలతో వినియోగదారులను ముంచే కుట్ర చేస్తున్నారన్నారు. ఎపుడో పదేళ్ల క్రితం వాడిన విద్యుత్‌కు ఇపుడు సర్దుబాటు పేరుతో వినియోగదారులపై ఛార్జీల భారం వేయడం సిగ్గుచేటన్నారు. నాలుగేళ్లలో రూ.25 వేల కోట్ల ఛార్జీల భారం వేస్తున్నారన్నారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలను గద్దెదింపి, గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సిపిఎం కార్యకర్తలు పాంగి జీవనకృష్ణ, కొర్ర కార్తీక్, సురేష్ పాల్గొన్నారు.

అనంతగిరి : విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా స్థానిక సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ సంస్కరణ పేరుతో కేంద్రప్రభుత్వం ఒత్తిళ్లకు తలొగ్గి, రాష్ట్ర ప్రభుత్వం ఇష్టనుసారంగా ఛార్జీల భారం పెంచడం దుర్మార్గమన్నారు. విద్యుత్ బిల్లుల కోసం అప్పులు చేసే పరిస్థితులు కలిగించవద్దని, ఛార్జీల పెంపు, సర్దుబాటు పేరుతో వడ్డన, ఇతరత్రా భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో.మొస్య, పార్టీ మండల కార్యదర్శి ఎస్ నాగులు. ఉప సర్పంచ్ పి.అర్జున్, కార్యకర్తలు పాల్గొన్నారు

అరకులోయ సబ్‌స్టేషన్ వద్ద ప్లకార్డులతో నిరసన

అనంతగిరిలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

నిరుద్యోగ యువతకు వృత్తివిద్యలో శిక్షణ

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలోని నిరుద్యోగ యువతకు కార్పెంటర్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణనిస్తారని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్ వి పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలోని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ప్రధాన కార్యాలయంలో శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత వసతి భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ద్వారా ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా రుణసదుపాయంకల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 73967 49236, 90596 65146, 80087 15357 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

26లోగా హిందీ పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి-పెదబయలు : దక్షిణ భారత హిందీ ప్రచారసభ, మద్రాస్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సెప్టెంబర్లో నిర్వహించే పరిచయ నుంచి రాష్ట్ర భాషా, ప్రవీణ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఫీజులు చెల్లించుటకు ఈనెల 26 వరకు గడువు ఇచ్చారని హిందీ ప్రచారక్ పి పాల్గుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.పది అపరాధ ఫీజుతో వచ్చేనెల 24వ తేదీ వరకుఫీజు చెల్లింపు గడువు పెంచారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సర్టిఫికెట్ కోర్సులో జాయిన్ కావాలని, పూర్తివివరాలకు 94935 31174 మొబైల్ నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అర్హులైన ప్రతిఒక్కరికీ గడచిన నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథక లబ్ధిని చేకూర్చిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతూ ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన సిఎం జగన్‌దేనన్నారు. 1902 నెంబరుకు ఫోనుచేసి ఫిర్యాదు పరిష్కారానికి జగనన్నకు చెబుదాం అమలు చేసిన ప్రభుత్వం, ఇపుడు జగనన్న సురక్షను ప్రవేశపెట్టి ఇంటింటికి వెళ్లి, వార్డు సచివాలయంలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి సమస్యలను పరిష్కరించే కార్యక్రమం చేపట్టనుందన్నారు. వాలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కార చర్యలు చేపట్టడంతోపాటు సంక్షేమ లబ్ధిని చేకూరుస్తారన్నారు. ఎటువంటి రుసుం లేకుండా అవసరమైన ధ్రువీకరణలను సచివాలయంలోనే ఉచితంగా అందజేస్తారన్నారు. జగనన్న సురక్ష విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల మండల స్థాయి అధికారులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అవయవదానంతో ఐదుగురికి ప్రాణదానం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రమాదవశాత్తు బహుళ అంతస్తుపై నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి అవయవాలను విమ్స్ ఆసుపత్రికి మృతుని బంధువులు దానం చేయడంతో ఐదుగురికి ప్రాణ భిక్ష లభించింది. ఆరిలోవకు చెందిన వెంకట సంతోష్‌కుమార్ (32) ఒక భవనం రెండవ అంతస్తుపై నుంచి రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని బంధువులు విమ్స్ ఆసుపత్రికి అవయవ దానం చేయడానికి నిర్ణయించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఆధ్వర్యాన నిష్ణాతులైన శస్త్ర చికిత్స నిపుణులు ఆపరేషన్ చేయడంతో మృతునికి చెందిన రెండు మూత్రపిండాలు, కాలేయం, రెండు కార్నియాలను సేకరించారు. దీనిపై విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు గురువారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. సేకరించిన ఐదు అవయవాలు చట్టబద్ధంగా జీవన్‌దాన్ పోర్టల్లో అవయవాల కోసం నమోదు చేసుకున్న ఐదుగురు సీనియర్ రోగులకు సకాలంలో అందించడంజరిగిందన్నారు. ఈ అవయవ దానం వల్ల ఐదుగురు ప్రాణాలు కాపాడగలిగామన్నారు. అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలన్నారు. అవయవదానం చేసిన మృతుని బంధువులకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే జీవన్ దాన్ పోర్టల్లో 2900 రోగులు పేర్లు నమోదు చేసుకున్నారని, వీరిలో1900 మందికి మూత్రపిండాలు, 700 మందికి కాలేయం, మిగిలిన వారికి ఇతర అవయవాలు అవసరమని తెలిపారు. బ్రెయిన్ హేమరేజ్తో మృతి చెందిన వెంకట సంతోష్‌కుమార్‌కు చెందిన ఒక మూత్రపిండాన్ని అపోలో ఆసుపత్రికి, మరొక మూత్రపిండాన్ని కిమ్స్ ఆసుపత్రి, కాలేయం పినాకిల్ ఆసుపత్రికి, రెండు కార్నియాలను ఎల్వి ప్రసాద్ ఆసుపత్రికి అందజేశామని చెప్పారు.

ఉపాధ్యాయ క్వార్టర్స్‌లో ఇతరుల తిష్ట!

నోటీసులిచ్చినా ససేమిరా పోనంటున్న పరిస్థితి
అర్హులైన టీచర్లకు వసతి లేక అవస్థలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లా కేంద్రం పాడేరులోని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ నివాస గృహాల్లో ఇతర వ్యక్తులు తిష్టవేసి, పెత్తనం చెలాయిస్తున్నారు. అర్హులైన గిరిజన ఉపాధ్యాయులకు మాత్రమే ఈ క్వార్టర్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీఈ, వారికి మొండిచేయి చూపించి ఇతర వ్యక్తులకు అప్పగించడంతో వారు అక్కడే తిష్ఠ వేశారు. తలారిసింగిలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉంది. ఇక్కడ పని చేసే ఉపాధ్యాయులు నివాసం ఉండేందుకు గతంలో ఎనిమిది నివాసగృహాలు (రేకుల ఇల్లు) నిర్మించారు. పాడేరు పట్టణ నడిబొడ్డున పిఎంఆర్సి రోడ్డులో ఐటిడిఎ ప్రహరీ పక్కనే ఉండడంతో వీటికి పోటీ ఎక్కువైంది. గిరిజన ఉపాధ్యాయులు మాత్రమే నివాసం ఉండాల్సిన టీచర్స్ క్వార్టర్స్‌లో ఉపాధ్యాయేతర, గిరిజనేతర వ్యక్తులు కొందరు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు లేకుండానే వీటిల్లో నివాసం ఉంటున్నారు. ఏళ్లతరబడి అక్కడే తిష్ఠ వేసి ఖాళీ చేయడం లేదు. అర్హులైన గిరిజన ఉపాధ్యాయులు అక్కడ ఉండేందుకు ప్రయత్నించిన వారికి ఇవ్వడం లేదు. ఖాళీ చేయాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా బుకాయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన గిరిజన ఉపాధ్యాయులకు నివాస గహాలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఇతరులు నివాసముంటున్న ఐటిడిఎ పక్కనే ఉన్న టీచర్స్ క్వార్టర్స్

నోటీసులు జారీ చేశాం

ఉపాధ్యాయుల నివాస గృహాల్లో నేను రాకముందే ఇతరులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. నేను బాధ్యతలు స్వీకరించిన తరువాత ఖాళీ చేయమని వారికి పలుమార్లు నోటీసులు ఇచ్చాం. అయినా స్పందించడం లేదు. గతంలో వీటిని సక్రమంగా పట్టించుకోకపోవడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో ఉపాధ్యాయ క్వార్టర్‌లో ఇతరులు తిష్ఠ వేశారు.

ఆర్.జాన్, హెచ్‌ఎం
జిటిడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాల, తలారిసింగి

కలుషితంగా ఉన్న కుండీబావిలోని నీటిని సేకరిస్తున్న గ్రామస్తులు

తాగునీటికి తిప్పలు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీ జంగంపుట్టు గ్రామంలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రక్షితనీటి సదుపాయం లేకపోవడంతో గ్రామానికి సమీపంలో ఉన్నా కుండి బావిలోని కలుషిత నీటిని సేకరించి తాగడంతోపాటు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.. గ్రామంలో25 కుటుంబాలకు చెందిన 110 మంది ఉంటున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల, గ్రామ ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు దొరకని పరిస్థితి ఉంది.ప్రభుత్వం తరపున గ్రామంలో తాగునీరు సౌకర్యం కల్పించకపోవడంతో, సాయిరాం సేవా ట్రస్టు అందించిన నీటిని ఉపయోగించేవాళ్లమన్నారు.. ప్రభుత్వ అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు, పాఠశాల సౌకర్యం కల్పించండి

సిపిఎం ఆధ్వర్యంలో మండల పరిషత్ ముట్టడించిన అణుకు గిరిజనులు

ప్రజాశక్తి -కోటవురట్ల : తమ గ్రామానికి రోడ్డు, పాఠశాల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని గురువారం అణుకు గ్రామానికి చెందిన గిరిజనులు సిపిఎం కార్యవర్గ సభ్యులు అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రధానకూడలి నుండి నినాదాలు చేసుకుంటూ వచ్చి మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు, రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసరంతోపాటు నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నామని, పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు నిత్యం 12 కిలోమీటర్లు కాలినడకన నడుచుకుంటూ వచ్చి చదువుకోవాల్సిన పరిస్థితి ఉందనిఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ అణుకు గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టి అభివృద్ధి పనులు చేయాలనిడిమాండ్ చేశారు అనంతరం ఎంపిడిఓ కాశీవిశ్వనాథరావుకు అణుకు గ్రామ గిరిజనులు, సిపిఎం నేతలు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

ప్రయాణ ఛార్జీలో 10 శాతం రాయితీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ . ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సుల్లో దూరప్రాంత ప్రయాణాలు చేసే వారు రానుపోను టిక్కెట్లను ఒకేసారి అడ్వాన్స్‌గా బుక్ చేస్తే ప్రయాణ ఛార్జీలో పదిశాతం రాయితీని పొందవచ్చని స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎంఎస్ ధీరజ్ తెలిపారు ఈనెల 21 నుండి ఎసి, నాన్ ఏసి దూర ప్రాంత బస్సులలో ప్రయాణించే వారు రానుపోను టిక్కెట్లు ముందుగానే ఒకేసారి బుక్ చేసుకుంటేఈ రాయితీ సౌకర్యం వర్తిస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఫోక్సో కేసులో యువకునికి మూడేళ్ల జైలు
-రూ.20వేలు జరిమానా

ప్రజాశక్తి -కొత్తకోట : బాలికపై అత్యాచారయత్నం కేసులో గర్నికం గ్రామ యువకునికి విశాఖ పోక్సో కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20వేల అపరాధ రుసుమును విధించిందని రావికమతం ఎస్ఐ ఉమమహేశ్వరరావు గురువారం తెలిపారు. 2018లో గర్నికం గ్రామానికి చెందిన ఒక బాలిక సైకిల్ తొక్కుకుంటూ ఆడుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన కేశంశెట్టి చిరంజీవి(25) బాలిక వెనుక నుంచి పట్టుకుని, సమీపంలోని చెరకు తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుప్రక్కల రైతులు, కుటుంబీకులు వచ్చి బాలికను రక్షించారు. చిరంజీవిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు అనంతరం రావికమతం పోలీసులు సమర్పించిన ఆధారాలతో కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చిందన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : స్థానిక ముస్లిం బడి వెనక ఉన్న ఖాళీ స్థలంలో గురువారం ఉదయం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. కొత్తవీధికి చెందిన మల్లేశ్వరరావు (30) చెట్టుకు ఉరేసుకుని ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మృతుడు మల్లేశ్వరరావు కళాసీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ : నాలుగు కేజీల గంజాయితో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కేడిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. గొలుగొండ మండలం ఏఎల్ పురం ఆర్‌టిసి బస్‌స్టాండ్ వద్ద గుంటూరు జిల్లాకు చెందిన కుంచం చినరాజప్ప(18), గూడి పవన్‌కుమార్(20), మందపల్లి వీరాంజేయనేయులు(35)లు బస్సు కోసం ఎదురు చూస్తుండగా అనుమానంతో బ్యాగ్ తనిఖీ చేయడంతో అందులో గంజాయిని ఉన్నట్లు గుర్తించారు. వీరి వద్ద రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

ఎయును సందర్శించిన ఇరాక్ దేశస్తులు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఇరాక్ దేశ విద్యామంత్రిత్వ శాఖ ఇంగ్లీష్ లాంగ్వేజ్ కరికులం విభాగాధిపతి, ఏయూ పూర్వ విద్యార్థిని హింద్ ఫరూక్ ఆలీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థిగా వర్సిటీ అభివృద్ధి జరుగుతున్న విధానం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున ఫరూక్ ఆలీని సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రావికమతం: మరుపాక ఆదర్శ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 7, 8, 9 తరగతులలో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్ తెలిపారు ఈ సీట్ల ఎంపిక ప్రక్రియ పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన, అలాగే రోస్టర్ ప్రకారం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు..పూర్తి వివరాలు కోసం తమ పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నెల్లూరు కృష్ణ స్ఫూర్తితో పోరాటం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : సమస్యల పరిష్కారానికి నెల్లూరు కృష్ణ స్ఫూర్తితో పోరాడుదామని అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లాడ.రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరు కృష్ణ సంతాప సభ అతని స్వగృహంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నర్సీపట్నంలో భవన నిర్మాణ కార్మికులను ఐక్యం చేసి, వారి సంక్షేమానికి , సమస్యల పరిష్కారానికి కృష్ణ ఎనలేని కృషి చేశారని, ఆయన మరణం భవన నిర్మాణ కార్మికలకు తీరనిలోటన్నారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పిఒ అభిషేక్

వ్యవసాయ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

ప్రధానమంత్రి కృషి సించాయి యోజనలో భాగంగా మొదటి దశ వాటర్ షెడ్ కార్యక్రమాన్ని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి గురువారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా 90 శాతం సబ్సిడీపై గిరిజన రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రూ.1.65 కోట్ల విలువైన టార్పాలిన్లు, కట్టర్లు, వాటర్ మోటర్లు, స్ప్రే తదితర పరికరాలను 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందించినట్లు తెలిపారు. మండలంలోని కొయ్యూరు, మంప, రేవళ్లు, రావణాపల్లి, మర్రివాడ పంచాయతీలలో వాటర్ షెడ్ మొదటి దశ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రైతులు సాగునీటిని నిల్వ చేసుకోవడానికి తగ్గట్టుగా చెరువులను మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఈ వాటర్ షెడ్ పథకానికి ప్రభుత్వం రూ.11 కోట్లు విడుదల చేసిందన్నారు. మండలానికి 1100 క్వింటాళ్ల వరి విత్తనాలు కావాలని ప్రభుత్వానికి కోరగా, ఇప్పటికే 850 విత్తనాలు అందుబాటులో వచ్చాయని, పంపిణీ కూడా మొదలైందని పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో అమాయక గిరిజనులు పట్టుబడి కారాగారాల్లో మగ్గడం బాధాకరమని, ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే గంజాయి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఉపాధి హామీ ద్వారా ఉద్యాన పంటలు సాగులో భాగంగా వెయ్యి ఎకరాలకు సరిపడా జీడిమామిడి మొక్కలను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్ బాబు, జడ్పిటిసి వార నూకరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ఏఎంసి డైరెక్టర్ అచ్యుత్, మండల సచివాలయాల కన్వీనర్ బండి సుధాకర్, స్థానిక ఎంపీటీసీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కుటుంబం కిడ్నాప్‌పై
సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబం, ఆడిటర్ జివి కిడ్నాప్ ఉదంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50 గంటల పాటు ఎంపీ కుటుంబాన్ని, ఆడిటర్ వెంకటేశ్వరరావు (జివి)లను చిత్ర హింసలు పెట్టినట్లు స్వయాన ఎంపీగారే ప్రెస్‌మీట్‌లో తెలియజేశారన్నారు. కిడ్నాపర్లు డబ్బులు డిమాండ్ చేసారని తెలిపారన్నారు. అలాగే పోలీసులు సకాలంలో జోక్యం చేసుకొని ప్రాణనష్టం లేకుండా బయటపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ మొత్తం వ్యవహారం ప్రజలకు అనేక అనుమానాలను కలిగిస్తోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేస్తే తప్ప వాస్తవాలు బయటకు రావన్నారు. కిడ్నాపర్ హేమంత్ కూడా ఎంపీతో తనకు లావాదేవీలు ఉన్నాయని, దాదాపు రూ.5 కోట్లు ఇవ్వాలని చెప్పినట్టు ప్రచారం జరుగుతోందన్నారు. ఇందులో వినిపిస్తున్న సుబ్బలక్ష్మి ఎవరు ? అన్నది తేల్చాలన్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసును సమగ్ర విచారణ చేయాలన్నారు. ఎంపీ సత్యనారాయణ విశాఖలో రాజకీయాలు, హైదరాబాద్‌లో వ్యాపారాలు చేసుకుంటానని ప్రకటన చేశారన్నారు. అలాగే విశాఖలో బిల్డింగ్ అనుమతులకు అనేక ఇబ్బందులు పెడుతున్నారని ప్రకటించారన్నారు. ఇవన్నీ చూస్తే ఆయనకు వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించడం తప్ప మరొక వ్యాపకం లేదని తెలుస్తోందన్నారు. ఈ ఘటన తరువాత ప్రజలు శాంతిభద్రతలు పట్ల ఆందోళనలు చెందుతున్నారన్నారు.

అమర్‌నాథ్‌కు ఏమైంది ?

తుమ్మపాలపై వీడని మౌనం
భాగాలుగా అమ్మాలని యోచన
చరాస్తుల విలువ కట్టేందుకు వచ్చిన అధికారులు
అడ్డుకున్న రైతు, కార్మిక సంఘాలు

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సుదీర్ఘ చరిత్ర కలిగిన తుమ్మపాల (అనకాపల్లి వివి రమణ కో - ఆపరేటివ్) సుగర్ ఫ్యాక్టరీ మరికొద్ది రోజుల్లో కనుమరుగుకానుంది. అమ్మకానికి మరో అంకం మొదలైంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ అచేతనంతో ఫ్యాక్టరీ చేజారిపోతోంది. కొత్త పరిశ్రమ తేలేకపోయినా, ఎంతో చరిత్ర ఉన్న సహకార ఫ్యాక్టరీని పరిరక్షించుకోలేకపోయిన అసమర్థునిగా నిలిచిపోనున్నారు. ఇది కూడా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గంలోని ఫ్యాక్టరీ కావడం మంత్రికి మరింత అప్రతిష్టమిగలనుంది. ఫ్యాక్టరీ అమ్మబోమంటూనే చరాస్తుల విలువ కట్టేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పుతామంటూనే ఆస్తుల మందిపునకు లిక్విడేటర్‌ను పెట్టింది. ఫ్యాక్టరీ ఆస్తులు అమ్మకానికి పెట్టేందుకు దూకుడుగా అడుగులు వేస్తోంది. ఇంత జరుగుతున్నా... మంత్రి అమర్‌నాథ్‌కు ఏమైందోగానీ ఫ్యాక్టరీ విషయమై మౌనందాల్చుతున్నారు. ఫ్యాక్టరీలోని చరాస్తులైన ప్లాంట్, మిషనరీ, స్క్రాప్, స్టోర్ మెటీరియల్ విలువ కట్టేందుకు గురువారం రహస్యంగా వచ్చిన అధికారులను ఎపి రైతు సంఘం నాయకులు, రైతులు, కార్మికులు అడ్డకొని బయటకు పంపించారు. లిక్విడేటర్ పివిఎస్ శాస్త్రి లేకుండానే చరాస్తుల విలువ కట్టేందుకు అధికారులు ఆదుర్ధాగా లోపలకు ప్రవేశించారు. ఈ నెల 30లోపు చరాస్తుల విలువ కట్టి నివేదిక సమర్పించాలని లిక్విడేటర్ కమిటీ కన్వీనర్, చిత్తూరు డిప్యూటీ కేన్ కమిషనర్ ఎంజె విక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు తుమ్మపాలను అమ్మకానికి పెట్టాలని భావించి, ప్రభుత్వం వెనక్కుతగ్గింది. రైతులు, రైతు, కార్మిక సంఘాల నుంచి ప్రతిఘటన బలంగావుండడంతో ముందడుగు వేయలేకపోయింది. ఇపుడు వచ్చే ఎన్నికల్లోపు ఈ ఫ్యాక్టరీ అమ్మకం పూర్తిచేయాలన్న ఆలోచనలో ప్రభుత్వమున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే తొలుత చరాస్తుల విలువ కట్టి, అమ్మకానికి పెట్టనుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఫ్యాక్టరీ స్థిరాస్తుల విలువకట్టించి కావాల్సిన వారికి కట్టబెట్టనుంది. ఫ్యాక్టరీ అమ్మకానికి పెట్టాలన్న టిడిపి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన వైసిపి అధికారంలోకి వచ్చాక అదే పంథాను అనుసరిస్తోంది. కో - ఆపరేటివ్ సుగర్ యాక్ట్ ప్రకారం రైతుల షేర్లు కంటే ప్రభుత్వ షేర్లు తక్కువవుంటే ఫ్యాక్టరీని అమ్మే అధికారం ప్రభుత్వానికిలేదు. అందుకనే ఈసారి ఆస్తుల అమ్మకంలో నైపుణ్యం ప్రదర్శిస్తోంది. గుండగుత్తగా ఆస్తులన్నీ ఒకేసారి అమ్మకుండా, భాగభాగాలుగా అమ్మకానికి పెట్టి ఫ్యాక్టరీని వదిలించుకొని ఆదాయం రాబెట్టుకోవాలని చూస్తోంది. తొలుత చరాస్తులపై పడింది. తరువాత స్థిరాస్తులపైకి రానుంది. ఫ్యాక్టరీకి దాదాపు రూ.500 కోట్ల విలువైన 37 ఎకరాల స్థిరాస్తులున్నాయి.

1935లో 50 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ప్రారంభమై, వెయ్యి టన్నుల సామర్థ్యానికి విస్తరించిన తుమ్మపాలను ఆధునికీకరించకుండా ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. తమ వాటాకింద 12,769 మంది రైతులు కోటీ 36 లక్షలా 81 వేలా 300 రూపాయలు షేర్‌గా పెట్టారు. అయితే ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించి ఫ్యాక్టరీ మరమ్మతులు, రైతుల బకాయిల నిమిత్తం ఇచ్చిన రూ.19 కోట్లా 52 లక్షలా 43 వేల రూపాయల రుణాన్ని తన షేర్ కింద మార్చుకుంది. రైతుల అవసరాలకు అనుగుణంగా ఫ్యాక్టరీని ఆధునికీకరించి, ఉప ఉత్పత్తులు తయారుచేయకుండా అమ్మకానికి కుట్రలు పన్నుతూ వస్తోంది. అయితే ప్రభుత్వ చర్యలను రైతు, కార్మిక సంఘాలు అడ్డుకుంటున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పుతామని చెప్పి చరాస్తుల విలువ కట్టించడం సరికాదని ఎపి రైతు సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి నాయినిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ అన్నారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వార్డు సచివాలయ పర్యావరణ, శానిటేషన్ సెక్రటరీల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, 'చెత్త సేకరణ' యూజర్ ఛార్జీల వసూళ్ల నుంచి వారిని మినహాయించాలని, చెత్తపై యూజర్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జివిఎంసిలో ఆ పార్టీ ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జివిఎంసి కమిషనర్‌కు గంగారావు లేఖ కూడా రాశారు.

జివిఎంసి సచివాలయ ఉద్యోగులపై వైసిపి ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పూనుకుందని జగ్గునాయుడు పేర్కొన్నారు. చెత్తపై యూజర్ ఛార్జీలను ప్రజల నుంచి వసూలు చేయలేదని సచివాలయంలోని పర్యావరణ, శానిటేషన్ సెక్రటరీలపై సస్పెన్షన్ విధించడం పూర్తి అప్రజాస్వామిక చర్య అని తెలిపారు. ఉద్యోగులపై నిర్బంధం ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ బతికిబట్ట కట్టలేదన్నారు. చెత్తపన్ను వసూలు చట్ట విరుద్ధమన్నారు. ఆస్తి పన్నులోనే చెత్త సేకరణ పన్ను కూడా ఉందని అన్నారు. వార్డు సచివాలయ పర్యావరణ, శానిటేషన్ సెక్రటరీలపై జివిఎంసి అధికారులు ఏకపక్షంగా తీసుకుంటున్న చర్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సిపిఎం ఫ్లోర్ లీడర్ గంగారావు అన్నారు. గతంలో జోన్-4లో అధికారుల వేధింపులు భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. కొంత కాలంగా చెత్త సేకరణ యూజర్ ఛార్జీలు వసూళ్ల టార్గెట్‌లు ఇస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వసూలు లక్ష్యాలు పూర్తిచేయకపోతే సస్పెండ్ చేస్తామని బెదిరించడం అన్యాయమన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - కొయ్యూరు : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-2ను గురువారం పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆయన వసతి గృహంలోని స్టోర్ రూమ్‌ను సందర్శించి బియ్యం, కూరగాయలు తదితర సామాగ్రిని పరిశీలించారు. అన్నీ సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసి, వార్డెన్ వేణును అభినందించారు. పామాయిల్ వస్తే తిరస్కరించి, సన్ ఫ్లవర్ ఆయిల్ తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎటిడబ్ల్యుఒ క్రాంతి కుమార్ ఉన్నారు.

సీలేరు నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - సీలేరు : విశాఖపట్నం - సీలేరు నైట్ హాల్ట్ బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని ఆర్టీసీ విశాఖ డిపో రీజినల్ మేనేజర్‌కు, ఆర్టీసి సిఐకు లేఖల రాసినట్లు స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విశాఖపట్నం -సీలేరు నైట్‌హాల్ట్ బస్సును ఆర్టీసీ అధికారులు అనాలోచితంగా రద్దు చేశారని తెలిపారు. దీంతో సీలేరు నుంచి నర్సీపట్నం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లా సరిహద్దులో ఉన్న గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యాం లేక అనే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులు బాగాలేదని, ఇతర సాకులు చెప్పి ఆర్టీసీ అధికారులు బస్సును అర్ధాంతరంగా నిలిపివేయడం సరికాదని పేర్కొన్నారు. అనేకసార్లు ఆర్టీసీ అధికారులకు స్వయంగా విన్నవించిన పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రాంత గిరిజనులు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సీలేరు-విశాఖపట్నం నైట్ హార్ట్ బస్ సర్వీస్ వెంటనే పునరుద్ధరించాలని కోరారు. దీనిపై విశాఖపట్నం డిపో ఆర్టీసీ సీఐతో తాను ఫోన్లో మాట్లాడానని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వైసిపి నేతలు బురదజల్లడం సరికాదు

ప్రజాశక్తి - కొయ్యూరు : జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జి వి.గంగులయ్య, ఇతర నాయకులు నియోజకవర్గంలోని అనేక గ్రామాలను సందర్శించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తుంటే వైసిపి నాయకులు తమ పార్టీపై బురదజల్లడం సరికాదని జనసేన మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రభావం రోజు రోజుకి నియోజకవర్గంలో పెరుగుతోందని, ఈ పరిస్థితిని చూసి తట్టుకోలేని వైసీపీ నాయకులు నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. నేటి సోషల్ మీడియా ప్రపంచంలో వాస్తవాలు ఏవో, అవాస్తవాలు ఏవో గిరిజనులకు తెలుసని, ఇలాంటి నాయకులకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు సాగిన బుజ్జిబాబు, సెగ్గే భావన, సాయిజయంతి, చిప్పల సిద్ధు, జుర్ర ప్రకాష్, పొత్తిక రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు సర్వీసులు పెంచాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో బస్సు ట్రిప్పులు, రద్దీ రూట్‌లలో సర్వీసుల సంఖ్య పెంచాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్‌ఎన్.రాజు, సంతోష్, జిల్లా నాయకులు తులసి కోరారు. గురువారం ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ ఎ.అప్పలరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంకావడంతో విద్యార్థులు విద్యాలయాలకు వెళ్లాల్సి ఉందన్నారు. ఉద్యోగాలు చేసేవారు, వివిధ పనులుపై తిరిగే ప్రయాణికులు నగరంలో ఎక్కువ సంఖ్యలో వున్నారన్నారు. బస్ సర్వీసులు ప్రయాణికులకు తగ్గట్టు లేకపోవడం బాధాకరమన్నారు. తగినన్ని బస్సులు లేక విద్యార్థులు ఫుట్‌బోర్డులపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. అందువల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో విద్యార్థులు ప్రమాదాలకు గురైన సందర్భాలూ ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలకూ ఆస్కారం లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని తెలిపారు.

మతతత్వ బిజెపిని గద్దె దించాల్సిందే

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మతతత్వ బిజెపిని కేంద్రంలో గద్దె దించాల్సిందేనని సిపిఐ రాష్ట్ర నాయకులు ఎజె స్టాలిన్ పిలుపునిచ్చారు. సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ, సమితి సమావేశాలు గురువారం అల్లిపురంలోని ఆ పార్టీ కార్యాలయంలో అత్తిలి విమల అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం, విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాలు, రాష్ట్రంలో నెలకొన్న శాంతి భద్రతల పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రధానంగా చర్చించి పలు నిర్ణయాలు చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పాల్గొన్నారు.